ఆకలి భారతం

అన్నపు రాశులు ఒకచోట..
ఆకలి మంటలు మరోచోట..
హంస తూలికలు ఒకచోట..
అలసిన దేహాలొకచోట...
ప్రజాకవి కాళోజీ అన్న ఈ మాటలు.. మోదీ ఏలుబడిలో ప్రస్తుతం దేశం అనుభవిస్తున్న దురావస్థకు సజీవ సాక్ష్యాలు.

మోదీ పాలనలో ఆయన ఆప్తమిత్రులు అదానీ, అంబానీలు ఒకవైపు అత్యంత శ్రీమంతులుగా చలామణి అవుతుండగా.. పేదోడికి పట్టెడు అన్నం కూడా దొరక్క ఆకలి కేకలు పెట్టే దుస్థితికి దేశం చేరింది.

హంగర్ ఇండెక్స్‌లో అట్టడుగున భారత్

- 125 దేశాల జాబితాలో 111వ ర్యాంకు
- గత ఏడాది కంటే 4 స్థానాలు దిగువకు
- 2014లో ర్యాంకు 55, ఇప్పుడు 111
- మోదీ తొమ్మిదేండ్ల పాలనలో ఇదీ దుస్థితి
- సూడాన్, రువాండా, కాంగో తదితర పేద దేశాలూ మనకంటే మెరుగ్గానే
- జీహెచ్ఐ నివేదికలో విస్మయకర వాస్తవాలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): ప్రపంచ ఆకలి సూచీలో (గ్లోబల్ హంగర్ ఇండెక్స్-జీహెచ్ఐ) భారత్ దారుణమైన స్థితికి పడిపోయింది. వివిధ దేశాల్లో ఆకలి స్థాయులు, పోషకాహార లోపాలను సూచించే ఈ సూచీలో 2023 సంవత్సరానికి గానూ మొత్తం 125 దేశాలను పరిగణనలోకి తీసుకొంటే 28.7 హంగర్ స్కోరుతో భారత్ 111వ స్థానంలో నిలిచింది. కిందటేడాది ర్యాంకుతో పోలిస్తే నాలుగు స్థానాలను కోల్పోయింది. గత కొంతకాలంగా తీవ్ర ఆహార సంక్షోభం ఎదుర్కొంటున్న పొరుగు దేశం శ్రీలంక, ఆర్థిక సంక్షోభానికి దగ్గర్లో ఉన్న పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, పేద దేశాలుగా పిలిచే సూడాన్, రువాండా, నైజీరియా, ఇథియోపియా, రిపబ్లిక్ ఆఫ్ కాంగోతో పాటు యుద్ధంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఉక్రెయిన్ (44)తో పోలిస్తే భారత్ దారుణమైన ర్యాంకుకు పడిపోవడం గమనార్హం. ఈ మేరకు జీహెచ్ఐ వార్షిక నివేదికలో వెల్లడైంది. భారత్‌లో ఆకలి స్థాయి చాలా తీవ్రంగా ఉన్నదని నివేదిక హెచ్చరించింది. సూచీలో చైనా, కువైట్, యూఏఈ సహా 20 దేశాలు 5 కంటే తక్కువ స్కోర్‌తో అగ్రస్థానంలో నిలిచినట్టు నివేదిక వెల్లడించింది.

మోదీ నిర్వాకం ఇది

ధరల నియంత్రణ, ఆహార భద్రత విషయంలో మోదీ సర్కారుకు ఎంతమాత్రం ప్రణాళిక లేదు. తెలంగాణవంటి రాష్ట్రాల్లో రైతులు కష్టపడి ధాన్యం పండిస్తే.. తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఆ ధాన్యాన్ని కేంద్రం కొనలేదు. దేశంలో ఒకవైపు ఆకలి కేకలు వినిపిస్తున్నప్పటికీ పట్టించుకోలేదు. ధాన్యం నిల్వల్ని ఎందుకు కొనరు? అని ప్రశ్నిస్తే గోదాముల్లో సరిపడా నిల్వలున్నాయని బదులిచ్చిన కేంద్రం.. తీరా గోధుమలు, బియ్యం, ఉల్లి.. ఇలా అన్నింటి ఎగుమతులపైనా నిషేధం విధించింది. నిల్వలు సరిపడా ఉన్నప్పుడు నిషేధం ఎందుకో సమాధానం మాత్రం ఇవ్వలేదు. ఇక, స్వతంత్ర భారతావని చరిత్రలో తొలిసారిగా టమాటాలను నేపాల్ నుంచి దిగుమతి చేసుకొని ఇటీవలే మోదీ సర్కారు రికార్డులకెక్కింది. గోధుమలను రష్యా నుంచి, కందిపప్పును మొజాంబిక్, మయన్మార్ నుంచి, వంటనూనెను ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకొనే దుస్థితికి భారత్ చేరుకుంది.



ఏమిటీ జీహెచ్ఐ సర్వే? నిర్వహించేదెవరు?

ప్రపంచ దేశాల్లో నెలకొన్న ఆకలి స్థాయిలు, పిల్లల్లో పోషకాహార లోపం, శిశుమరణాలు తదితర గణాంకాలు ఆధారంగా చేసుకొని జీహెచ్ఐ వార్షిక నివేదికను ఐర్లాండ్‌కు చెందిన కన్‌సర్న్ వరల్డ్‌వైడ్, జర్మనీకి చెందిన వెల్ట్ హంగర్ లైఫ్ సంస్థలు ఏటా సంయుక్తంగా వెలువరిస్తాయి. ఎక్కువ స్కోర్, ర్యాంకు సాధించిన దేశంలో ఆకలి సంక్షోభం తీవ్ర రూపంలో ఉన్నట్టు పరిగణించాలి.

పొరుగు దేశాలు మెరుగ్గా.. భారత్ మాత్రం

జీహెచ్ఐ ర్యాంకింగ్స్‌లో భారత్ కంటే పొరుగు దేశాలు మంచి ప్రదర్శనను చూపించడమే కాదు.. కిందటేడాదితో పోలిస్తే ర్యాంకులను మెరుగుపర్చుకున్నాయి కూడా. కిందటేడాది 64వ ర్యాంకు సాధించిన శ్రీలంక ఇప్పుడు 60వ ర్యాంకును, గత ఏడాది 81వ ర్యాంకులో ఉండే నేపాల్ ప్రస్తుతం 69 స్థానాన్ని , నిరుడు 84వ ర్యాంకులో ఉండే బంగ్లాదేశ్ ఇప్పుడు 81వ ర్యాంకును సాధించగా.. భారత్ మాత్రం నాలుగు స్థానాలను కోల్పోయి 107వ ర్యాంకు నుంచి 111వ స్థానానికి పడిపోవడం గమనార్హం. అయితే జీహెచ్ఐ నివేదికను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఆకలి స్థాయుల్ని లెక్కించడానికి ఉపయోగించే పద్ధతి అశాస్త్రీయంగా ఉన్నదంటూ మండిపడింది.

మాకు ఓటేసిన గ్రామాల్లోనే అభివృద్ధి పనులు

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

బెంగళూరు, అక్టోబర్ 12: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమకు ఓటేసిన గ్రామాల్లోనే అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే హెస్‌సీ బాలకృష్ణ వ్యాఖ్యానించారు. బీజేపీ, జేడీఎస్ జట్టుకట్టడంపై ఆయన స్పందిస్తూ.. అది కాంగ్రెస్‌కే లాభిస్తుందన్నారు. 'మా ప్రభుత్వం మరో ఐదేండ్లు అధికారంలో ఉంటుంది. మాకు ఓటేసిన గ్రామాల్లోనే అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతాం' అని స్పష్టంచేశారు. బాలకృష్ణ వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మాజీ సీఎం బొమ్మై స్పందిస్తూ.. రాష్ట్రంలో అభివృద్ధి పనులకు నిధులే లేవని.. ఇది సున్నా నిధుల ప్రభుత్వమని విమర్శించారు.

కరెంట్ కోతలతో రైతులకు ఇక్కట్లు

యెడియూరప్ప

శివమొగ్గ: కరెంటు కోతలు, లోడ్ షెడ్డింగ్‌తో కర్ణాటక రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆ రాష్ట్ర మాజీ సీఎం యెడియూరప్ప అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై త్వరలోనే యాత్ర నిర్వహిస్తానని చెప్పారు. 'ప్రతి ఒక్కరూ కరెంటు కోతల షాక్‌ను ఎదుర్కొంటున్నారు. కనీసం 3-4 గంటలు కూడా ప్రభుత్వం కరెంటు సరఫరా చేయలేక పోతున్నది' అని కర్ణాటక మాజీ సీఎం యెడియూరప్ప తెలిపారు.

అధ్యక్ష వ్యవస్థ దిశగా భారత్

న్యాయ కోవిదుడు ఫాలీ నారీమన్

న్యూఢిల్లీ: భారతదేశం అధ్యక్ష వ్యవస్థ దిశగా అడుగులేస్తున్నదని.. ప్రపంచవ్యాప్తంగా నిరంకుశ ప్రభుత్వాల ట్రెండ్ కనిపిస్తున్నదని న్యాయ కోవిదుడు ఫాలీ నారీమన్ అన్నారు. మాజీ ఎన్నికల ప్రధాన కమిషనర్ ఎస్‌వై ఖురేషీ రాసిన పుస్తకం ఆవిష్కరణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఏక కాలంలో ఎన్నికల వల్ల వ్యయం తగ్గుతుందన్న వాదనలను కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తోసిపుచ్చారు. పార్లమెంటరీ వ్యవస్థ, నోరు లేని పార్లమెంట్ అనే అధ్యాన వ్యవస్థలు ప్రస్తుతం మనకు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

బెంగాల్ బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు

పార్టీ కార్యాలయం ఎదుట కార్యకర్తల నిరసన

సుకాంత

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు తీవ్ర స్థాయికి చేరాయి. రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద గురువారం పెద్ద ఎత్తున కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ అగ్ర నేతల వైఖరిని తీవ్రంగా దుయ్యబట్టారు. ఎంతో కాలం నుంచి పార్టీకి సేవ చేస్తున్నవారికి విలువ ఇవ్వడం లేదని, ఇతర పార్టీల నుంచి కొత్తగా వచ్చినవారికి పదవులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సుకాంత మజుందార్, ప్రధాన కార్యదర్శి అమితభ చక్రవర్తి తదితర నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుదీర్ఘ కాలం నుంచి పార్టీకి విధేయంగా ఉన్న సీనియర్ నేతలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

హామీలన్నీ 'హస్త'వ్యస్తమే!

- హామీలను నెరవేర్చని ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్
- జాబితాలో పేదలకు ఇండ్లు, నిరుద్యోగ భృతి, ఉద్యోగకల్పన, మద్యనిషేధం, రైతులకు పింఛన్లు
- ప్రజల్లో అంతకంతకూ పెరుగుతున్న అసమ్మతి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వంపై అక్కడి ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. 2018 ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ సీఎం రమణ్‌సింగ్ నియోజకవర్గం రాజ్‌నంద్‌గావ్ ర్యాలీలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పాల్గొన్నారు. 'జన్ గోష్‌నా పత్రా' పేరిట మేనిఫెస్టోని విడుదల చేశారు. కరెంటు బిల్లుల్లో 50 శాతం రాయితీ, అర్హులైన పేద మధ్యతరగతివారికి ఇండ్లు లేదా భూమి, 'రాజీవ్ మిత్ర యోజన' కింద రాష్ట్రంలోని 10 లక్షల మంది నిరుద్యోగ యువతకు నెల నెలా నిరుద్యోగ భృతి, 'ఘర్ ఘర్ రోజ్‌గార్, హర్ ఘర్ రోజ్‌గార్' పథకం కింద నిరుద్యోగులకు శిక్షణ-ఉపాధి కల్పన, పేదలు, మధ్యతరగతికి ఉచిత వైద్యం తదితర హామీలు గుప్పించారు. అయితే ఐదేండ్లు గడిచినా ప్రధాన హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు.. వాటి పరిస్థితి

ఇచ్చిన హామీ	ప్రస్తుత పరిస్థితి
• కరెంటు బిల్లుల్లో 50 శాతం రాయితీ	పైలట్ ప్రాజెక్టు ప్రారంభించి వదిలేశారు
• 60 ఏండ్లు పైబడిన రైతులకు పింఛన్లు	జరుగలేదు
• అర్హులైన పేద, మధ్యతరగతివారికి ఇండ్లు లేదా భూమి	30 శాతం లక్ష్యం కూడా చేరుకోలేదు
• 10 లక్షల మంది నిరుద్యోగులకు నెల నెలా నిరుద్యోగ భృతి	జరుగలేదు
• నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి కల్పన	శిక్షణ ఇచ్చి వదిలేశారు
• రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేదం	జరుగలేదు
• పేదలు, మధ్యతరగతికి ఉచిత వైద్య సేవలు	ఎక్కడా అమలవ్వట్లేదు
• బస్తర్, సర్గుజా, గరియాబంద్‌లోని ప్రాంతాలకు ఎయిర్ అంబులెన్స్ సేవలు	జరుగలేదు

కనీస సౌకర్యాలు కల్పించనందుకు ఎన్నికల బహిష్కరణ

కోర్‌బా: తాగునీరు, కరెంటు లాంటి కనీస సౌకర్యాలు కల్పించనందుకు అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించాలని ఛత్తీస్‌గఢ్‌లోని రెండు గిరిజన గ్రామాలు నిర్ణయించాయి. బీజేపీ ఎమ్మెల్యే నన్కీ రామ్ కన్వర్ ప్రాతినిధ్యం వహిస్తున్న రామ్‌పూర్ నియోజకవర్గంలోని కెరకచ్చర్ గ్రామపంచాయతీ పరిధిలోని సర్దిహ్, బాగ్దారిదండ్ గ్రామాల ప్రజలు ఈ మేరకు గ్రామ శివార్లలో బ్యానర్ ప్రదర్శించారు. గ్రామస్థులకు కరపత్రాలు పంచారు. 'పట్టి వాగ్దానాలతో రాజకీయ నాయకులు గెలవలేరు. మాకు మరో మార్గం లేక ఈసారి ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించాం' అని కొందరు గ్రామస్థులు మీడియాకు తెలిపారు.

చౌహాన్‌కు చెక్

సింధియా విధేయులందరికీ బీజేపీ టికెట్లు

భోపాల్: కేంద్ర మంత్రి, బీజేపీ నేత జ్యోతిరాధిత్య సింధియా తన పంతాన్ని నెగ్గించుకున్నారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తన విధేయులకు టిక్కెట్లు ఇప్పించడంలో ఆయన సఫలీకృతులయ్యారు. సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సింధియాకు విభేదాలు ఉండటంతో ఆయన విధేయులకు టిక్కెట్ల కేటాయింపుల్లో అన్యాయం జరుగుతుందని మొదట్నుంచి ప్రచారం జరిగింది. అయితే శివరాజ్‌ను పెద్దగా పట్టించుకోని బీజేపీ కేంద్ర నాయకత్వం సింధియా విధేయులు ప్రస్తుత క్యాబినెట్‌లో ఉన్న ఏడుగురు మంత్రులకు టికెట్లు కేటాయించింది. సింధియా వెంట బీజేపీలో చేరిన అనేకమంది ఎమ్మెల్యేలు ఇతర పార్టీల్లో చేరడంతో మిగిలిన వారిని కాపాడుకోవడం కోసం టికెట్లు ఇచ్చినట్టు తెలుస్తున్నది.

ఆదివారాలు పవిత్రం.. కౌంటింగ్ తేదీ మార్చరూ!

ఈసీకి మిజోరం పార్టీల విజ్ఞప్తి

ఐజ్వాల్: క్రైస్తవులు ఎక్కువగా ఉండే మిజోరంలో అసెంబ్లీ ఓట్ల లెక్కింపు తేదీని మార్చాలని ప్రధాన పార్టీలన్నీ ఎన్నికల సంఘాన్ని కోరాయి. ఆదివారాలు క్రైస్తవులకు పవిత్రమైనవని.. ఆ రోజు ప్రార్థనా కార్యక్రమాలు జరుగుతాయని ఈసీకి తెలిపాయి. ఈ నేపథ్యంలో ప్రజల విశ్వాసాలను దృష్టిలో ఉంచుకొని కౌంటింగ్ తేదీని మార్చాలని ఈసీని కోరాయి.

ధాణె రైల్వేస్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నేతలు

అంబేద్కర్ వర్ధంతిన ప్రత్యేక రైళ్లు నడపాలి

ధాణే స్టేషన్ మాస్టర్‌కు బీఆర్ఎస్ నేతల వినతి

ముంబై, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా డిసెంబర్ 5న లక్షలాది మంది తెలుగువారు ముంబైలోని చైత్య భూమిని సందర్శిస్తారని, వారి కోసం ప్రత్యేకంగా రైళ్లు నడపాలని ధాణే రైల్వేస్టేషన్ మాస్టర్‌కు బీఆర్ఎస్ నేతలు గురువారం వినతిపత్రం అందజేశారు. కరీంనగర్, నల్గొండ నుంచి ప్రత్యేక రైళ్లను నడపాలని, ప్రస్తుతమున్న కొన్ని రైళ్లను క్రమబద్ధీకరించాలని కోరుతూ రైల్వేశాఖ మంత్రికి లేఖ రాశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ... డిసెంబర్ 5న కరీంనగర్ -దాదర్(ముంబై), నల్గొండ -దాదర్ (ముంబై) వరకు, తిరుగు ప్రయాణంలో డిసెంబర్ 6న దాదర్ నుంచి కరీంనగర్, దాదర్ నుంచి నల్గొండ వరకు ప్రత్యేక రైళ్లను నడపాలని కోరారు. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి నాందేడ్ వరకూ నడుస్తున్న అజంతా ఎక్స్‌ప్రెస్ 17063/4ను ప్రతి రోజూ ముంబై వరకు నడపాలన్నారు. ప్రతిరోజూ ముంబై, పన్వేల్ నుంచి నాందేడ్ వరకు నడుస్తున్న పన్వేల్ ఎక్స్‌ప్రెస్ 17613/4, రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ 17611/2 లను కరీంనగర్ వరకు పొడిగించాలని కోరారు. వారంలో ఒకసారి కాజీపేట-దాదర్‌ల మధ్య నడుస్తున్న 07195/6 ఎక్స్‌ప్రెస్‌ను క్రమబద్ధీకరించి, ప్రతిరోజూ నడపాలన్నారు. ఈ రైళ్లన్నింటినీ గంగాధర, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, మోర్తాడ్, నిజామాబాద్, నాందేడ్, మన్మాడ్ స్టేషన్ల మీదుగా నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత బుద్ధి హేమంత్ కుమార్, కొంకణ, ముంబై విభాగ సోషల్ మీడియా ప్రచారకులు మహేంద్ర కంటే, ధాణే లోక్‌సభ సహాయ సమన్వయకర్త దొనకొండ సంతోష్, నాయకులు ఉప్పరి శ్రీనివాస్, చంద్రకాంత్ నగర్కర్ తదితరులు పాల్గొన్నారు.

'గంగాజలం'పై జీఎస్టీ.. వెనక్కి తగ్గిన కేంద్రం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్(నమస్తే తెలంగాణ): ప్యాకేజ్డ్ గంగాజలంపై 18 శాతం జీఎస్టీ విధింపు నిర్ణయంపై కేంద్రం వెనక్కి తగ్గింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ) గురువారం ఎక్స్‌లో వివరణ ఇచ్చింది. గంగాజలం సహా అన్ని పూజా సామగ్రిలను జీఎస్టీ స్లాబ్ నుంచి మినహాయిస్తున్నట్టు పేర్కొన్న ప్రతిని ఈ మేరకు ఉదహరించింది. ఆన్‌లైన్ మాధ్యమాల్లో కొనుగోలు చేసే గంగాజల్ బాటిల్స్ మీద జీఎస్టీ 18 % వసూలు చేస్తుండటం, ప్యాకేజ్డ్ గంగాజలం వాటర్ మీద కేంద్రం 18 శాతం జీఎస్టీ విధించినట్టు పలు మీడియాల్లో వార్తలు రావడంతో కేంద్రం నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పై విధంగా స్పందించింది.

కొత్త ట్రిక్‌తో రైల్వేకు బురిడీ

ముంబై : టికెట్ లేకుండా రైళ్లలో ప్రయాణిస్తున్న వారు సరికొత్త విధానంతో ట్రైన్ టికెట్ ఎగ్జామినర్లను బురిడీ కొట్టిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. స్మార్ట్‌ఫోన్ యూజర్ల కోసం రైల్వే యూటీఎస్ ఆన్ మొబైల్ యాప్‌ను తీసుకొచ్చింది. దీని సాయంతో రైల్వే స్టేషన్‌కు 20 మీటర్ల దూరంలో ఉండి టికెట్ బుక్ చేసుకోవచ్చు. అయితే జియో-ఫెన్సింగ్‌తో సంబంధం లేకుండా స్టేషన్ల పేర్లు, క్యూఆర్ కోడ్స్‌లను ఓ వెబ్‌సైట్ అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని సాయంతో కొంతమంది రైల్లో ఉంటూనే తనిఖీల సమయంలో టికెట్లు బుక్ చేసుకుంటున్నారు. ఈ మోసాన్ని పశ్చిమ రైల్వే గుర్తించింది.

రాజస్థాన్‌లో బీజేపీ ఎంపీ ర్యాలీపై రాళ్లదాడి

జోధ్‌పూర్: రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీ నేతల మధ్య కుమ్ములాటలు పతాకస్థాయికి చేరుకున్నాయి. సంచోర్ అసెంబ్లీ స్థానానికి నామినేషన్ వేయడానికి వెళ్తున్న బీజేపీ ఎంపీ దేవ్‌జీ పటేల్ కాన్వాయ్‌పై కొంతమంది రాళ్లదాడికి పాల్పడ్డారు. వీరంతా మరో బీజేపీ ఎంపీ దానరామ్ చౌదరీ అనుచరులని వార్తలు వెలువడ్డాయి. పార్టీ టికెట్ దేవ్‌జీ పటేల్‌కు కేటాయించటాన్ని చౌదరీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

14న రింగ్ ఆఫ్ ఫైర్!

న్యూఢిల్లీ: ఈ నెల 14న ఏర్పడుతున్న సంపూర్ణ సూర్యగ్రహణానికి ఓ ప్రత్యేకత ఉంది. సూర్యగ్రహణం సమయంలో అత్యంత అరుదుగా ఏర్పడే 'రింగ్ ఆఫ్ ఫైర్' (ఉంగరం ఆకృతిలో సూర్య వలయం) ఆకాశంలో ఆవిష్కృతం కాబోతున్నది. ఇది అమెరికా, మెక్సికో సహా దక్షిణ, మధ్య అమెరికాలోని పలు దేశాల్లో మాత్రమే కనపడనున్నది. ఈ దేశాల్లో 'రింగ్ ఆఫ్ ఫైర్' చివరిసారి 2012లో కనిపించగా, మళ్లీ ఇప్పుడు చూడబోతున్నారు. దీని తర్వాత 2046 వరకు 'రింగ్ ఆఫ్ ఫైర్' కనిపించదని సైంటిస్టులు చెబుతున్నారు. కాగా ఈసారి సూర్యగ్రహణం భారత్ సహా అనేక దేశాల్లో కనిపించటం లేదు. 'సూర్యగ్రహణం వేళ ఏర్పడే అద్భుతమైన వలయం చూసే అవకాశం అరుదుగా వస్తుంది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి' అని నాసా సైంటిస్టు పెగ్ లూసి అన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 4.30 గంటలకు అంతరిక్షంలో సంభవించే అరుదైన దృశ్యాన్ని నాసా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నది.

ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధిగాంచిన గ్లోబల్ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ పోటీలలో భారత్‌కు చెందిన ఆరుగురు ఫొటోగ్రాఫర్లు సత్తా చాటారు. భారత్‌కు చెందిన శ్రీరామ్ మురళీ, విహాన్ తాల్యా వికాస్, నెజిబ్ అహ్మద్, విష్ణు గోపాల్, వినోద్ వేణు గోపాల్, రాజ్‌మోహన్ అవార్డులకు ఎంపికయ్యారు. లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియం (ఎన్‌హెచ్ఎం) నుంచి వీరు అవార్డులను అందుకోనున్నారు. శ్రీరామ్ మురళీ తీసిన అన్నామలై అడవి చిత్రమిది.

లండన్, పారిస్‌ను హడలెత్తిస్తున్న నల్లులు

పారిస్, అక్టోబర్ 12: యూరప్‌లోనే అతిపెద్ద నగరాలైన లండన్, పారిస్‌ను నల్లులు హడలెత్తిస్తున్నాయి. మునుపెన్నడూ లేనంత స్థాయిలో నల్లులు వ్యాప్తి చెందటంతో పారిస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. నల్లుల బాధ తట్టుకోలేక పారిస్, మార్సెల్లీలలో జనాలు పాత పరుపుల్ని ఆరు బయట ఎక్కడ పడితే అక్కడ వదిలేస్తున్నారు. సినిమా థియేటర్లు, హోటల్స్, దవాఖానాలు, రైళ్లు.. ఇలా అన్నిచోట్లా నల్లులు విస్తరించాయి. బ్రిటన్ వ్యాప్తంగా ఇండ్లల్లో నల్లులు కుట్టడం 65శాతం పెరిగిందని పెస్ట్ కంట్రోల్ కంపెనీ 'రెంటోకిల్' వెల్లడించింది. క్రిమిసంహారకాలాల్ని వెదజల్లి వీటిని చంపేందుకు హోటల్స్ సిబ్బంది తంటాలు పడుతున్నారు. పరుపుల్లో ఉండే ఈ నల్లులు రాత్రిపూట మనిషి శరీరం నుండి రక్తాన్ని పీల్చుతాయి. ఇవి అంత ప్రమాదకరం కాకపోయినా, వీటి వల్ల మానసిక సమస్యలు, ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటివి ఉంటాయి. దురద, అలర్జీ, చర్మ సంబంధ సమస్యలు రావొచ్చు.